RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 41 | పేజీలు : 4 | బుధవారం 12 ఆగస్టు 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసు.. జస్టిస్ యశ్వంత్ వర్మను దోషిగా తేల్చిన ప్యానెల్!

- నగదు కేసులో మాజీ జడ్జి యశ్వంత్ వర్మను దోషిగా తేల్చిన ప్యానెల్
- వర్మ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొన్న కమిటీ
- నగదును వర్మ స్వయంగా తొలగించారనడానికి ఆధారాలు లేవన్న కమిటీ
- కీలక ఆధారాలను సరిగ్గా భద్రపరచలేదని దర్యాప్తుపై ప్యానెల్ ఆగ్రహం
- నగదు కనిపించకుండా పోవడంపై స్పష్టత లేదని నివేదిక



## జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరం

- జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు

### రూ.2.08 లక్షల కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు

# ఏకగ్రీవ ఆమోదం



- చంద్రబాబు అధ్యక్షతన 20వ ఎస్ఐపీబీ సమావేశం...
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు భేటీ
- రాష్ట్రవ్యాప్తంగా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు
- విశాఖ, కర్నూలు, తిరుపతి జిల్లాలకు అత్యధికంగా పెట్టుబడులు
- లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి నూతన రంగాలపై దృష్టి సారించాలని సీఎం ఆదేశం

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో భారీ పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదముద్ర లభించింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడులకు బోర్డు ఏకగ్రీవంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 21,627 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

1. ఓకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్: కర్నూలు జిల్లా, రూ.616 కోట్లు, 130 ఉద్యోగాలు
2. జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్: కర్నూలు జిల్లా, రూ.1533 కోట్లు, 250 ఉద్యోగాలు
3. ఎఫ్ పీఈఎల్ రవ్వేద పవర్: విజయనగరం జిల్లా, రూ.480 కోట్లు, 275 ఉద్యోగాలు
4. వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్: కాకినాడ జిల్లా, రూ.15,000 కోట్లు, 1500 ఉద్యోగాలు
5. ఆరాధ్యా బయోగ్యాస్: కర్నూలు జిల్లా, రూ.143.47 కోట్లు, 595 ఉద్యోగాలు
6. ఉషోదయా బయోగ్యాస్: నెల్లూరు జిల్లా, రూ.143.47 కోట్లు, 595 ఉద్యోగాలు

- మిగతా3లో



## భారత్‌లో డిజిటల్ విప్లవం

- డిజిలాకర్‌కు 72 కోట్లు, ఉమంగ్‌కు 11 కోట్ల యూజర్లు!
- డిజిలాకర్ యూజర్ల సంఖ్య 72.43 కోట్లు దాటిందని కేంద్రం వెల్లడి
- గత మూడేళ్లలో ఉమంగ్ ప్లాట్‌ఫామ్‌పై దాదాపు 798 కోట్ల లావాదేవీలు
- డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పౌర సేవలు మరింత సులభతరం
- గ్రామ పంచాయతీ స్థాయిలో 4 లక్షలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్లు
- మహిళల ఆధ్వర్యంలో 70,000కు పైగా సీఎస్‌సీల నిర్వహణ

### ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా

# గొంతు నొక్కుతున్నారు

- నాణేనికి మరో వైపు చూపిస్తా
- ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు
- పార్టీ ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం
- శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్సీలకు సూచన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై గళమెత్తాలని ఆదేశం
- ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళతానన్న జగన్



**అమరావతి**

ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. “గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. - మిగతా3లో

## బీసీ మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్లు

- తెలంగాణలో రేపే ‘ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల’ పథకం ప్రారంభం: నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి
- విధి విధానాలను రేపు ప్రకటించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ



### క్యూర్ పరిధిలో

# ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణం

- భూమిపూజ చేయనున్న రేవంత్ రెడ్డి
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి భూమిపూజ
- కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్లకు శంకుస్థాపన చేయనున్న సీఎం
- ఇళ్ల దరఖాస్తులకు ఈనెల 15 వరకు గడువు

**హైదరాబాద్**

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి (గురువారం) భూమి పూజ చేయనున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. క్యూర్? పరిధిలో 16 నియోజకవర్గాల్లో రూ.807.40 కోట్లతో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టనున్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు ఈ నెల 15 వరకు గడువు ఉంది.

**అధికారులకు దిశానిర్దేశం**

సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. పటిష్ట భద్రత చర్యలు అమలు చేయాలని, హెలిప్యాడ్, రూట్ ప్రాంగణం, పార్కింగ్, వంటివి జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.





## అంబటి రాంబాబు, మోదుగుల సహా 17 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు

- డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ నిరసన ప్రదర్శన
- అనుమతి లేకుండా ర్యాలీ చేపట్టారంటూ అడ్డుకున్న పోలీసులు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారంటూ కేసు నమోదు

### ఫ్యామిలీ రిజిస్టర్

# సర్టిఫికెట్ చెల్లదు

- ఫ్యామిలీ సర్టిఫికెట్‌పై ఈసీ స్పష్టత
- తెలంగాణ ఓటర్ల జాబితా సవరణలో కీలక పరిణామం
- ఇది రేషన్ కార్డుతో సమానమని, రుజువుగా అంగీకరించలేమని స్పష్టత
- నోటీసులు అందుకున్న ఓటర్లు ఇతర పత్రాలు సమర్పించాలని సూచన




**హైదరాబాద్**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా, ‘ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్’ను గుర్తింపు పత్రంగా అంగీకరించబోమని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టం చేసింది. ఈ సర్టిఫికెట్ల జారీపై గత కొంతకాలంగా నెలకొన్న గందరగోళానికి ఈసీఐ తాజా ప్రకటనతో తెరపడింది. రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు) డేటా ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తున్న ఈ సర్టిఫికెట్, రేషన్ కార్డుతో సమానమని ఎన్నికల సంఘం- మిగతా3లో

బుధవారం 12 ఆగస్టు 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# డోర్ టూ డోర్ టూర్ వేగం పెంచండి

....ఇంటింటికీ కార్యక్రమాన్ని మరింత బాగా చేయండి

టీడీపీ శ్రేణులకు జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి సూచన

పరిటాల శ్రీరామ్ తో కలిసి పార్టీ నాయకులతో సమావేశం

ధర్మవరంలో పార్టీ కార్యకలాపాలపై చర్చించిన శ్రీనివాసరెడ్డి



**ధర్మవరం ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం.**

ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని ధర్మవరం నియోజకవర్గంలో చాలా వేగవంతంగా చేస్తున్నారని.. మరింత బాగా చేయాలని పార్టీ శ్రేణులకు టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. ధర్మవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ తో కలిసి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయన్న విషయాలను పార్టీ నాయకులతో కలిసి ఆరా తీశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ఎలా జరిగింది.. కొత్త ఓటర్ల చేరిక ఎలా సాగుతోందని ఆరా తీశారు. ముఖ్యంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమం చాలా బాగా చేస్తున్నారని అభినందించారు. అలాగే తక్కువ శాతం నమోదైన చోట వేగవంతం చేయాలన్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు, నాయకులు మరింత బలంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ఎంత బాగా ప్రజల్లోకి తీసుకెళ్తే.. అంత మంచి విజయం మన వైపు ఉంటుందన్నారు. ధర్మవరంలో పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల సమస్యలను పరిటాల శ్రీరామ్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డికి తెలియజేశారు.



# బోనాల సంబరాల్లో ఆధ్యాత్మిక శోభ..!!

ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి బోనాల వేడుకలు.

సోమందేపల్లి లో అంగరంగ వైభవంగా బోనాల పండుగ.

ప్రత్యేక పూజల్లో మంత్రి సవిత.







**సోమందేపల్లి ఆగస్టు 12 సీమ వార్త సాయంకాలం.**

తొగట వీర క్షత్రియ ఆరాధ్య దైవమైన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకల సందర్భంగా బోనాల పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయపద్ధంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పాల్గొన్నారు. సాంప్రదాయ బద్ధంగా నిర్వహించిన బోనాల కార్యక్రమంలో మంత్రి పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు ఈ సందర్భంగా భక్తులతో కలిసి అమ్మవారిని స్మరిస్తూ ప్రత్యేక పూజలు చేయించారు. చౌడేశ్వరి అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర ప్రజలపై, నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. డీసీ ఈశ్వరయ్య దంపతులు మంత్రిని సాదరంగా స్వాగతం పలికి ఆమెకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కదిరి ఎమ్మెల్యే కంది కుంట వెంకట ప్రసాద్ ను సత్కరించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మండల కూటమి నాయకులు కార్యకర్తలు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు విచ్చేసిన భక్తులకు భోజన వసతి కల్పించారు. బోనాల పండుగ సందర్భంగా పోలీసులు కట్టు దిట్టమైన ఏర్పాట్లు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు.





# ఆసుపత్రి సౌకర్యాలపై కలెక్టర్ ఆరా..!!

**పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్**



**పెనుకొండ ,ఆగస్టు,12: సీమ వార్త సాయంత్రం.** పెనుకొండలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని వివిధ విభాగాలను నేరుగా పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించి వైద్యాధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం, ఇన్-పేషెంట్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, డయాగ్నోస్టిక్ ల్యాబ్, ఫార్మసీ మరియు రికార్డులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా లేదా, మందులు ఉచితంగా ఇస్తున్నారా అని ఆరా తీశారు.డాక్టర్లు, వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు.ఆసుపత్రి ఆవరణం, వార్డులు మరియు శానిటేషన్ నిరంతరం శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అత్యవసర మందులు మరియు ఇంజెక్షన్లు నిరంతరం అందుబాటులో ఉంచాలని, బయటకు రాయకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్,పెనుకొండ మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్,పెనుకొండ తహసీల్దార్ స్వాతి,డిసిహెచ్ఎస్ మధుసూదన్,ఆసుపత్రి సూపరింటెండెంట్,వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రుడు ఉంటే వర్షాలు రావా..!!

.....హంద్రీనీవాకు నీళ్లు ఎలా వచ్చాయి: జేసీ ప్రశ్న ....నీటి సమస్యపై మంత్రులు స్పందించాలి: జేసీ డిమాండ్

....గండికోటలో నీరున్నా గ్రామాలకు కరువు ....యాడికి, పప్పూరు రైతులకు నీళ్లు లేవు: జేసీ ఆవేదన

**తాడిపత్రి, ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం:**



అనంతపురం జిల్లాలో వర్షాలు సరిగ్గా లేకపోవడంతో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందని మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. రాజకీయ నాయకులు, అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, హెచ్ యల్ సి , హంద్రీనీవా కాలువల ద్వారా జిల్లాలోకి నీరు ప్రవేశించిన మాట వాస్తవమేనని, అయితే ఆ నీరు కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. జదీచీ ఉంటే వర్షాలు రావా? ఏలినోవో, గిలినోవో అంటున్నారు తప్ప పెద్దగా వర్షాలు పడటం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉంటే వర్షాలు రావని కొందరు అంటున్నారు. వర్షాలు రాకపోతే హంద్రీనీవా కాలువకు నీరు ఎలా వచ్చాయి? దీనికి ఎవరైనా సమాధానం చెప్పగలరా? ప్రకృతి ఏ విధంగా సృష్టిస్తుందో ఎవరికి తెలియదు" అని జేసీ ప్రశ్నించారు.

**గండికోటలో నీరున్నా...**

"మా తాడిపత్రి నియోజకవర్గానికి ఎటువంటి నీటి సమస్య ఉండదు. ఎందుకంటే గండికోట రిజర్వాయర్ లో ఇప్పటికీ నీరు దండిగా ఉన్నాయి. కానీ అవి తాడిపత్రి పట్టణ ప్రాంతానికి మాత్రమే సరిపడతాయి. యాడికి , పప్పూరు మండలాల రైతులకు పంటలు సాగు చేసుకోవడానికి నీరు అందడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు నష్టం, వ్యాపారాలు దెబ్బ ఇప్పటికే తాడిపత్రి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో వర్షాల ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గ్రామీణ ప్రజల దగ్గర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో తాడిపత్రి పట్టణంలో కూడా వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. "ఇప్పటికైనా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కాలువ శ్రీనివాసులు వంటి నాయకులు నీటి సమస్యపై ముందు జాగ్రత్తగా స్పందించి అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే అనంతపురం జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉంది" అని జేసీ అన్నారు.

# మూడు మతాల సింబల్స్‌తో.... వెల్కమ్ టు తాడిపత్రి..!!

....స్వాతంత్ర దినోత్సవంకు సిద్ధమైన తాడిపత్రి నగరం

....జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విదేశాల తరహా ఏర్పాట్లు

....కొత్త బ్రిడ్జి వద్ద వాటర్ ఫౌంటెన్, లైటింగ్ గేట్

.....ఆకర్షణీయంగా వంద అడుగుల జాతీయ జెండా







**తాడిపత్రి ఆగస్టు 10 సీమ వార్త సాయంత్రం:**

74వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు తాడిపత్రి నగరం సిద్ధమైంది. మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని కొత్త బ్రిడ్జి వద్ద విదేశాల తరహా అలంకరణలు చేపట్టారు.వంద అడుగుల ఎత్తైన జాతీయ జెండా ను ఇక్కడ ఏర్పాటు చేయడంతో పాటు, "వెల్కమ్ టూ తాడిపత్రి " అనే ఆకర్షణీయ లైటింగ్ గేట్ ను నిర్మించారు. ఈ గేట్ పై ఓం , చంద్రవంక, క్రాస్ అనే మూడు మతాలకు చెందిన చిహ్నాలను ఏర్పాటు చేయడం విశేషం.

జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విదేశాల తరహా ఏర్పాట్లు పట్టణాన్ని సుందరంగా తీర్చిద్దాలనే లక్ష్యంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నామని జేసీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలు గర్వంగా తలెత్తుకునేలా నగరాన్ని ముస్తాబు చేస్తున్నామన్నారు. గత 25 రోజులుగా రోజు రాత్రి పగలు పనులు జరుగుతున్నాయి.

**కొత్త బ్రిడ్జి వద్ద వాటర్ ఫౌంటెన్, లైటింగ్ గేట్**

బ్రిడ్జి వద్ద వాటర్ ఫౌంటెన్, రకరకాల పూల మొక్కలు, కలర్ ఫుల్ లైటింగ్ ఏర్పాట్లతో నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాత్రి వేళల్లో ఈ అలంకరణలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

**ప్రజల ఆకర్షణ కేంద్రంగా మారిన బ్రిడ్జి**

సాయంత్రం వేళల్లో వందలాది మంది ప్రజలు కుటుంబాలతో వచ్చి ఈ అందాలను తిలకిస్తున్నారు. యువత సెల్ఫీలు, రీల్స్ తీస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. లైట్ అండ్ సౌండ్ షో, దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ఉంటాయని జేసీ తెలిపారు.

సీమ వార్త సాయంకాలం
బుధవారం
12 ఆగస్టు 2026

# కలంపదునుతో ప్రజల గుండెల్లో నిలిచిన యాదాటి కాశీపతి

యాదాటి కాశీపతికి ఘన నివాళి

సీనియర్ జర్నలిస్ట్ శ్రీధర్ కు స్మారక పురస్కారం

**తాడిపత్రి, ఆగస్టు 10 సీమ వార్త సాయంత్రం:** విప్లవ రచయిత, ప్రముఖ పాత్రికేయులు యాదాటి కాశీపతి 10వ వర్ధంతి సభను తెలుగువెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఘనంగా నిర్వహించింది. తాడిపత్రిలోని సూర్య హై స్కూల్ లో జరిగిన ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు టీవీరెడ్డి అధ్యక్షత వహించారు. కాశీపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా టీవీరెడ్డి మాట్లాడుతూ కాశీపతి తన జీవితాన్ని ప్రజల కోసం, సాహిత్యం కోసం అంకితం చేశారు. ప్రజాసేవకు మారు పేరుగా నిలిచారు" అన్నారు. రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, ఉపాధ్యాయులు దేవాన్ మాట్లాడుతూ కాశీపతి విప్లవ రచయితగా, కవిగా, వామపక్ష నేతగా, జర్నలిస్టుగా అనేక వ్యాసాలు రాశారని తెలిపారు. ప్రజా గళం, 'విప్లవ గీతాలు' వంటి ఆయన రచనలు నేటికీ యువతకు స్ఫూర్తినిస్తున్నాయన్నారు. విప్లవస్ఫూర్తిని నింపే కవిత్వాలు, యువతను, విద్యార్థులను ఆలోచింపజేసే ఉపన్యాసాలు అందించి ప్రజా ఉద్యమాల కోసం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కాశీపతి రాసిన కవితలు చదివి, ఆయన ఆశయాలపై ప్రసంగాలు చేసి నివాళులు అర్పించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

**సీనియర్ జర్నలిస్ట్ శ్రీధర్‌కు సత్కారం**



యాదాటి కాశీపతి స్మృతిలో సీనియర్ జర్నలిస్ట్ దుగురు శ్రీధర్ ను యాదాటి కాశీపతి స్మారక పురస్కారం తో సత్కరించారు. దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై కలం పదును పెడుతున్న శ్రీధర్ సేవలను గుర్తిస్తూ శాలువా, జ్ఞాపిక, నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. కాశీపతి ఆశయాలను కొనసాగిస్తామని, ప్రతి ఏడాది ప్రజా సమస్యలపై రాసే జర్నలిస్టులకు పురస్కారం అందిస్తామని టీవీరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మునిస్వామి, హెడ్ మిస్ట్రెస్ ఆశాబి, ఉపాధ్యాయులు షరీఫ్, జ్ఞానేశ్వరి మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమం







యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమం.

**ధర్మవరం ఆగస్టు 12 సాయంకాలం సీమ వార్త:** ధర్మవరం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శక్తి మైత్రి మహిళా సంఘం సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ఐ.ఈ.సి, హెచ్ ఐ వి, డ్రగ్స్ గురించి ప్రచార కార్యక్రమ ప్రారంభోత్సవం చేయడం జరిగిందని, ధర్మవరం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐ ఈ సి విరం ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ఆగస్టు 12వ తేదీ బుధవారం రోజున ముఖ్య అతిథులుగా విచ్చేసిన ధర్మవరం రెండవ పట్టణ పోలీసు సిఐ జయ నాయక్ మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్ రెండవ పట్టణ ఎస్సై వీరేష్ కళాశాల ప్రిన్సిపల్ జెవి సురేష్ బాబు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున ప్రభుత్వ న్యాయవాది బాల కుమారి కౌన్సిలర్ వనమాల ప్రాజెక్టు మేనేజర్ నవీన్ కుమార్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణమ్మ వై రాజేష్ సంయుక్తంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ సమాజంలో దీర్ఘకాలిక మార్పుకు మరియు యువత డ్రగ్స్ మరియు చెడు వ్యసనాలకు ర్యాగింగ్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టం దగ్గర ఎలాంటి పరిణామాలు ఉంటాయో న్యాయవాది బాల కుమారి తెలియజేశారు. అదేవిధంగా ప్రజా ఆరోగ్యం మరియు సామాజిక అంశాలపై అవగాహనకు ఐ ఈ సి ప్రచార కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు యువత ఈ అవగాహన కార్యక్రమాలను అవగాహన చేసుకుని ఉపయోగించుకుని సమాజ శ్రేయస్సుకు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు శక్తి మైత్రి మహిళా సంఘం సంస్థ చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలను వారు అభినందించారు. అదేవిధంగా నవీన్ కుమార్, వనమాల హెచ్ఐవి వ్యాధి మరియు చికిత్స గురించి ఆరోగ్య పరిరక్షణ పరిశుభ్రత వ్యాధుల నివారణ మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి పై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడానికి మరింత చైతన్యం తీసుకురావడానికి ఐ ఈ సీ ప్రచారం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ మొదలుపెట్టిన రిస్క్ అసైన్మెంట్ గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి ఉండాలని కళాశాల స్థాయి విద్యార్థులు ఇటువంటి ప్రచార కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు ఈ కార్యక్రమంలో శక్తి మైత్రి మహిళా సంఘం సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణమ్మ జయలక్ష్మి సుమలత సరస్వతి వంశీ లోకేష్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## పులేరు లో..భూ రీ సర్వే పై ర్యాలీ.

పాల్గొన్న హస్తకళల స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్.



**గోరంట్ల ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల మండలం పులేరు గ్రామపంచాయతీ, వెంకటరమణపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పులేరు గ్రామ పొలంలో భూ రీసర్వేపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలోరాష్ట్ర హస్తకళల డైరెక్టర్ పొగాకుల సోమశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొగాకుల సోమశేఖర్ మాట్లాడుతూ పులేరు గ్రామ పొలంలో 3399 ఎకరాల భూమి ఉండగా, మొత్తం 11:41 ఖాతా నంబర్లు,362 సర్వే నంబర్లు ఉన్నట్లు తెలిపారు. దాదాపు వంద సంవత్సరాల క్రితం జరిగిన భూ సర్వే అనంతరం ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పద్ధతులతో రీసర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు.భూ రీసర్వే ద్వారా భూమి యొక్క ఖచ్చితమైన విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, భూ వివరాలు స్పష్టంగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రీసర్వే పూర్తయిన అనంతరం భూ రికార్డుల్లో వివరాలను సరిచూసి, అర్హత కలిగిన భూ యజమానులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. పాసుపుస్తకంలో భూమికి సంబంధించిన స్కెచ్‌ను కూడా పొందుపరచడం జరుగుతుందని వివరించారు.రీసర్వే సమయంలో రైతులు తమ భూమికి సంబంధించిన పాత పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను అధికారులకు చూపించి తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. సర్వే సమయంలో భూమి హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర వివరాల్లో ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. భవిష్యత్తులో భూ వివాదాలను తగ్గించడంతో పాటు భూ రికార్డులను మరింత పారదర్శకంగా, కచ్చితంగా నిర్వహించేందుకు రీసర్వే ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు.ప్రతి రైతు రీసర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకుని తమ భూ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని పొగాకుల సోమశేఖర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్, మండల సర్వేయర్ కోదండపాణి, వీఆర్వో నాగరాజుస్వామి, సచివాలయ సర్వేయర్ కాశీ విశ్వనాథ్, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## గోవా గవర్నర్ తో... రాయల్ మురళి భేటీ.

.....గోవా గవర్నర్ ను కలిసిన అఘోరా భార్గవ్రామ్ కేదార్నాథ్ స్వామీజీస్వామి, ట్రస్ట్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల్ మురళి.

--గవర్నర్ కు వినాయక పంచలోహ విగ్రహాన్ని సృష్టించి అందజేసిన అఘోర భార్గవ్ కేదార్నాథ్ స్వామిజి





**అనంతపురం డెస్క్ ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం.** కేరళ కు చెందిన శ్రీ శ్రీ అఘోర అవధూత రామానంద స్వామి సేవ ట్రస్ట్ చైర్మన్ అఘోర స్వామి మంగళవారం గోవాలో గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును రాయల్ మురళిని వెంటబెట్టుకొని మర్యాదపూర్వకంగా కలిశారు... ఈ సందర్భంగా ట్రస్ట్ తరఫున చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను గవర్నర్ కు వివరించారు.. తమిళనాడు, కేరళ, కర్ణాటక పుదుచ్చేరి రాష్ట్రాలలో ట్రస్ట్ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని వారు గవర్నర్కు తెలిపారు... ఈ సందర్భంగా అఘోర స్వామి కార్యాలయంలోనే తన శక్తితో పంచలోహ వినాయక విగ్రహాన్ని సృష్టించి గవర్నర్ అశోక్ గజపతి రాజుకు బహుకరించారు... మన దేశంలో వినాయక చవితి ఉత్సవాలు అద్భుతంగా జరుగుతాయనే విషయం తెలిసిందే... ఈ సందర్భంగా రాయల్ మురళి తనకు ముందు నుండి పరిచయస్తుడని, తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు తనను పలు సందర్భాల్లో కలిసిన విషయాన్ని గవర్నర్ ఈ సందర్భంగా స్వామీజీకి తెలియజేశారు... ఆధ్యాత్మిక చింతన కలిగిన రాయల్ మురళిని నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించినట్లు స్వామీజీ తనను కలిసిన పాత్రికేయులకు తెలిపారు.

## జ్ఞానజ్యోతి పై రెండవ రోజు శిక్షణ కార్యక్రమం



**లేపాక్షి :** లేపాక్షి మండల కేంద్రంలోని లేపాక్షి ఉర్దూ హై స్కూల్ రెండవ రోజు అంగన్వాడి కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం సైతం నిర్వహించారు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వై జర్ శ్రీ లక్ష్మి, డిఆర్పి లు లక్ష్మీనారాయణ, కేశవ్ ప్రసాద్, జయ కృష్ణ, కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి సూపర్వై జర్ మాట్లాడుతూ ఆదర్శీల, నవచే తన, పాఠశాల సంసిద్ధత, తల్లి దండ్రుల భాగస్వా మ్యం తదితరాం శాలపై అవగాహన కార్యక్రమంలో సంపూర్ణమ్మ, సూపర్వైజర్ శ్రీ లక్ష్మి , మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కార్య కర్తలు పాల్గొన్నారు.

## పార్టీలో కష్టపడిన వారికి టిడిపిలోనే సముచిత స్థానం

### అన్నవరం ఆలయ కమిటీ మెంబర్ రామాంజనేయులు



**మడకశిర ఆగస్టు 12 సీమ వార్త సాయంకాలం** తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందని అన్నవరం ఆలయ కమిటీ మెంబర్ రామాంజనేయులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా నాయి బ్రాహ్మణ సాధికారిక జిల్లా కన్వీనర్ గా గ్రామ గ్రామాన ప్రతి మండల కేంద్రంలో పార్టీ బలోపేతనికి కృషి చేయడం జరిగిందని దానిలోని భాగంగానే ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో ఈ స్థానం తనకు దక్కిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించడంతో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమంలో నిర్వహించడంతోపాటు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అన్నవరం ఆలయ కమిటీ మెంబర్ రామాంజనేయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఈరన్న, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జ్ మంజునాథ్, యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, మాజీ జెడ్పిటిసి సన్నతిమప్ప, నాగేంద్ర, నాగరాజు తదితరులు ఘనంగా సన్మానించారు.

## అభివృద్ధి కార్యక్రమాలపై డోర్ టు డోర్ కార్యక్రమం



**మడకశిర ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం** ఎమ్మెల్యే టిటిడి పాలక మండలి సభ్యులు టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు , రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల ఎష్టమేరకు మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డ్ 193 బూత్ నందు డోర్ టు డోర్ కార్యక్రమం చేపట్టడం జరిగింది . రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి మరియు నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో మూడోవార్డ్ అధ్యక్షులు నరేష్ , యూనిట్ ఇంచార్జ్ ఓం ప్రకాష్ , డీలర్ బిఎల్ శివ , తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## "ప్రసాద్" స్కీమ్ తో లేపాక్షి ఆలయ అభివృద్ధిపై





**లేపాక్షి ఆగష్టు12సీమా వార్త :** విజయవాడలో గల బిజెపి రాష్ట్ర కార్యా లయంలో బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీ ని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్, బిజెపి నాయకులు పరిగి వేణుగోపాల్ రావ్ సమావేశ మయ్యారు. లేపాక్షి నంది విగ్రహాన్ని బుధవారం స్థానిక అమరావతి సచివాలయంలో హిందూపురం శాసన సభ్యులు పెద్దలు నందమూరి బాల కృష్ణ కార్యాలయం సూచన మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో పర్సనల్ సెక్రటరీ శ్రీనివాసులు ని మర్యాద పూర్వ కంగా లేపాక్షి నంది విగ్రహాన్ని అందిం చారు. ఈ సందర్భంగా లేపాక్షి ఆలయం లో ఇటీ వల జరిగిన కార్యక్రమాలను తెలియచేసి "ప్రసాద్" పథకం యొక్క ప్రస్తుత స్థితి గురించి చర్చిం చారు. అదే విధంగా లేపాక్షి ఆలయాన్ని సందర్శించాలని కోరడం జరిగింది. అందించారు. ఈ సందర్భంగా లేపాక్షి ఆలయంలో జరుగు తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించి మీరు లేపాక్షి ఆలయాన్ని సంద ర్శించాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.

సీమ వార్త సాయంకాలం

బుధవారం
12 ఆగస్టు 2026

# ఘనంగా ఎర్రగుంటపల్లి చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు

**పుష్పాలతో కలకలాడిన చౌడేశ్వరి దేవి ఆలయం**
**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**
**అన్నదాన ప్రసాద వితరణ**





**తాడిపత్రి, ఆగస్టు 10 సీమ వార్త సాయంత్రం:** తాడిపత్రి రూరల్ మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలోని చింతకుంట రోడ్డులో వెలసి ఉన్న శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 2000 మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చౌడేశ్వరి దేవి అమ్మవారిని పలు రకాల పుష్పాలతో, పండ్లతో ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. ఎర్రటి గులాబీలు, తెల్లటి మల్లెలు, పసుపు, నారింజ పూల దండలతో ఆలయం కలకలాడింది. ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాయసం, పులిహోర, చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

ఉత్సవాల సందర్భంగా రాత్రంతా భజనలు, కోలాటాలు నిర్వహించారు. మహిళలు భక్తి గీతాలు పాడుతూ అమ్మవారిని కీర్తించారు. చిన్నారులు దేశభక్తి నృత్యాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు క్యూ లైన్ లో నిలబడి ప్రసాదం స్వీకరించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ సామూహికంగా భోజనాలు చేసి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఈ ఉత్సవాల కోసం ఆలయ కమిటీ సుమారు 10 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. అలంకరణలు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాలన్నీ ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. చింతకుంట రోడ్డులో వెలసిన ఈ చౌడేశ్వరి దేవి ఆలయం గ్రామస్తులకు కులదైవంగా విరాజిల్లుతోంది.

## మాజీ మంత్రి ఉషశ్రీపై....పోలీసులకు ఫిర్యాదు.

కులం పేరుతో దూషించిందని నాగే నాయక్, నిందా ఆరోపణలు చేసిందని సుబ్బారెడ్డి లు ఫిర్యాదు.



**గోరంట్ల ఆగస్టు 11 సీమ వార్త.** ఇటీవల గోరంట్ల పట్టణంలో మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని నిరసన కార్యక్రమాలు చేపడుతూ ఆ సమావేశంలో కులం పేరుతో దూషించి అవమానించిందని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పై మండల టిడిపి నేతనాగే నాయక్ మరియు నిందారోపణలు చేసిందని సుబ్బారెడ్డి గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ ఉనికి కోసం మాజీ మంత్రి ఉషశ్రీ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తోందని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మంత్రిని దూషించిందని ఫిర్యాదులు పేర్కొన్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాల కృష్ణ చౌదరి, జిల్లా కార్యదర్శి నరేష్, సిక్స్ మాన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్, నాగే నాయక్, అజంతుల్లా, జయరాం, సుబ్బారెడ్డి,నబీ రసూల్, డీలర్ రమేష్, ప్రతాప్ చౌదరి, సుభహన్,కురవ మల్లి కార్జున, ఎస్సీ నారాయణ, సద్దాం, రోహిత్, శ్రీకాంత్,కురవ మహేంద్ర మల్లేష్, కసిరెడ్డిపల్లి శంకర తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి దేవి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం.



**గోరంట్ల ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం.** మండలం,గుమ్మయ్యగారిపల్లిలో వెలసి ఉన్న చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా బుధవారం విశేష పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకం, ప్రసాద వితరణ కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. శ్రీ మారేమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవరాజుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుటక శంకర్, రామ్మోహన్ రెడ్డి, ధనుంజయ, ఆదినారాయణ, వెంకట్ రెడ్డి, వెంకటప్పతో పాటు గ్రామ ప్రజలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చౌడేశ్వరి దేవి పుట్టినరోజు సందర్భంగా డాక్టర్ బి. దేవరాజుస్వామి చేతుల మీదుగా కేక్ కట్ చేసి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా భక్తుల సహకారంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు డాక్టర్ బి. దేవరాజుస్వామి తెలిపారు.

## తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపీ డీవో కార్యాలయం ఎదుట సిపిఐ నాయకులు ధర్నా



**లేపాక్షి ఆగస్టు 12 సీమ వార్త సాయంకాలం :** లేపాక్షి పంచాయతీ పరిధిలోని ఎన్ ఆర్ నగర్ కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని బుధవారం సిపిఐ నాయకులు, కాలనీవాసులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టి శివప్ప సీనియర్ నాయకులు, మండల కార్యదర్శి గౌతమ్ కుమార్ మాట్లాడుతూ లేపాక్షి పంచాయ తీలో ఎన్ ఆర్ నగర్ కాలనీలో 2014లో సిపిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటి నుండి ఆ కాలనీ వాసులు తాగునీటి కోసం చాలా ఇబ్బం దులు పడుతు న్నారు. దాదాపు రెండేళ్ల క్రితం, ఆ కాలనీలో పంచా యతీ ఆధ్వర్యంలో బోరు వేయడం జరిగింది. ఆబోరుకు మోటారు పంపు సెట్టు పైపులు దింపడం జరిగిం. ఆ బోరుకు సంబం ధించి స్టార్టర్ కూడా అక్కడే ఉంచడం జరిగింది కానీ అధికారులు మాత్రం ఎన్నిసార్లు విన్న వించిన పట్టించు కోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రెండు కరెంటు ఫోల్ల దూరంలో ట్రాన్స్ఫార్మర్ కనెక్షన్ ఇచ్చి కలెక్షన్ ఇచ్చి ప్రజల దాహార్తి తీర్చాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, గుల్జార్, గంగాధర్, రాము, సుధాకర్, సుమన్, టి. రుబియాభాను, నాంజమ్మ, నరసిం హ, నారాయణప్ప, కాలనీ వాసులు సిపిఐ నాయకులు తది తరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవంపై శాంతి కమిటీ సమావేశం



**లేపాక్షి ఆగస్టు 12 సీమ వార్త సాయంకాలం** : వచ్చే నెలలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా తీసుకో వాల్సిన చర్యలపై అధికారులతో తాసిల్దార్ సౌజన్య లక్ష్మి బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో పాటు గ్రామాల బాతులు వినాయక విగ్రహ ప్రతిమల ఏర్పాటు, విగ్రహ కమిటీల ఏర్పాటు పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అధికారులు చేయాలని తహసిల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఫైర్, ఆర్ అండ్ బి ఏఈ, పోలీసులు,సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వద్దు బ్రదర్ - ర్యాష్ డ్రైవింగ్ నో చెప్పండి

**మద్యం తాగి వాహనం నడపొద్దు ఎస్ఐ సుధాకర్ యాదవ్**



**సోమందేపల్లి ఆగస్టు 12 సీమ వార్త సాయంకాలం** చౌడేశ్వరి అమ్మవారి జయంతి బోనాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుందని నేపథ్యంలో ఎస్ఐ సుధాకర్ యాదవ్ ప్రజలలో అవగాహన కల్పించేందుకు వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా పలు సామాజిక సందేశాలతో కూడిన ఫ్లెక్సీ లను ఏర్పాటు చేశారు. శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి యువతకు సందేశం కల్పించారు. ప్రస్తుతం యువతను ఆందోళనకు గురి చేస్తున్న డ్రగ్స్ వినియోగంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ద్వారా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వాటికి అలవాటు పడకుండా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. మహిళలు బాలికల భద్రతకు సంబంధించిన సందేశాలను కూడా ఫ్లెక్సీ ద్వారా ప్రజలలోకి తీసుకెళ్లారు. ఆడపిల్ల నవ్వితే లోకం బాగుంటుంది అనే సందేశం తో బాలికలను గౌరవించాలని వారికి సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పోలీసులు సూచించారు.

## అగాపే ఆశ్రమంలో అన్నదానం



**యాడికి ఆగస్టు 12 సీమ వార్త సాయంకాలం** యాడికి మండలం కేంద్రం కవలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీ లో ఉన్న అగాపే ఆశ్రమంలో వేములపాడు ప్రాంతంలో నివాసం ఉంటున్న చుక్కలూరు పవన్ కుమార్ రెడ్డి భార్య భాగ్యలక్ష్మి వీరి కుమారుడు రంజిత్ కుమార్ రెడ్డి 21వ పుట్టినరోజు శుభ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారితో పాటు వారికుటుంబ సభ్యులు పెద్దనాన్నలు రామనందారెడ్డి, పురుషోత్తం రెడ్డి, అన్నలు చెల్లెళ్లు సహారిక ఆశ్రమంలోని వృద్ధులకు, నిరాశ్రయులకు భోజనాలు సిద్ధం చేయించి అందరికీ కూడా వడ్డించారు. ఇందు నిమిత్తమై ఆశ్రమం ఫౌండర్ బత్తుల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారి కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు.

## చెరువు కాలువ, రహదారి ఆక్రమణ పై ఫిర్యాదు



**టి సుండుపల్లె ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం** మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని మల్లక్క గారి పల్లె గ్రామం నుండి పూర్వం నుండి పొలాలకు వెళ్లే రహదారిని, రెడ్ల చెరువు మోరవ కాలువను, గుట్టను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చదును చేసి కొబ్బరి చెట్లను నాటి రాతి కూసాలతో ఫెన్సింగ్ వేస్తున్నాడని బుధవారం గ్రామస్తులు తహసిల్దార్ వేణుగోపాల్ కి వినతి పత్రం అందజేశారు. సుండుపల్లె – 2 గ్రామపంచాయతీకి సంబంధించిన విఆర్ఓ కు బుధవారం ఉదయాన్నే గ్రామస్తులు విషయం తెలుపగా గుట్టను చదును చేసే స్థలం వద్దకు చేరుకుని జెసిబి చదును చేస్తుండడం చూసి మీకు ఎక్కడో ఒకచోట దారి ఇస్తారులే అని గ్రామస్థులకు పొంతన లేని సమాధానం చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయారు. అనంతరం గ్రామస్తులు అందరూ కలసి స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని తహసిల్దార్ కు అర్జీ రూపంలో తెలియజేసి తమకు న్యాయం చేయాలని వారు కోరుకున్నారు.

## పురం వాసి... గోరంట్ల బస్టాండ్‌లో గుండెపోటుతో మృతి.



**గోరంట్ల ఆగస్టు 11 సీమ వార్త** హిందూపురం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ చెందిన శ్రీరాములనే వ్యక్తి మంగళవారం సాయంత్రం గోరంట్ల పట్టణ బస్టాండ్ వద్ద గుండెపో టుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి స్థానిక సీఐ బోయ శేఖర్ సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

## ఉరి వేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య.



**గోరంట్ల ఆగస్టు 12 సీమ వార్త. సాయంత్రం.** గోరంట్ల పట్టణంలోని కొలిమి చింతమాను వీధిలో నివాసముండే వడ్డే సిద్దయ్య కుమార్తె ఇంటర్ విద్యార్థి వడ్డే హేమ శ్రీ (18) బుధవారం తన నివాసంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లకెళితే మండలంలోని కొండాపురం పంచాయతీ కాంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే సిద్దయ్య కుమార్తె వడ్డే హేమశ్రీ అనంతపురంలోని ఎస్ ఎల్ ఎన్ జూనియర్ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఫ్యానుకు చున్నీ వేసుకుని ఆత్మహత్య చేసుకుందని, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుందని, ఆరోగ్యంపై మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసుల దర్యాప్తులో వాస్తవ విషయాలు తెలియాల్సి ఉంది.

## అంగన్వాడీ కార్యకర్తలకు 3 రోజుల 'జ్ఞాన జ్యోతి' శిక్షణ

**పిల్లల అభ్యసనలో ఆటల ఆధారిత పద్ధతులపై అవగాహన**



**సోమందేపల్లి ఆగస్టు 12 సీమ వార్త సాయంకాలం** సోమందేపల్లి మండలం పరిధిలోని 3 సెక్టార్ల అంగన్వాడీ టీచర్స్ కు పి డి ఆదేశాల మేరకు సీడీపీఓ డాక్టర్ శాంతలక్ష్మి సూచనలతో సూపర్ వైజర్ శుభారాణి ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి మూడవ సంవత్సరం 6 రోజులు ట్రైనింగ్ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో రెండవ రోజు ట్రైనింగ్ జరిగినది.మొదటి విడతగా మూడు రోజులు ఈ నెల 11, 12, 13 తారీఖులో జరుగుతుందని ఈ ట్రయినింగ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం నూతన విద్యా విధానంలో భాగంగా అంగన్వాడి స్కూల్లో పిపి 1, పిపి 2 గా రెండు భాగాలుగా పిల్లలకు మాట్లాడడం, ఆటలు ఆడడం, వ్రాయడం, చదవడం నేర్పడం జరుగుతుందని దీనికి సంబంధించి ఎలా చేయాలో అనేటువంటి విధానాలు అంగన్వాడీ ఉపాధ్యాయులకు ట్రైనింగ్ ఇవ్వడం జ్ఞానజ్యోతి ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.రిమోట్ లేర్నింగ్ మెసేజ్ గురించి మాట్లాడుతూ ప్రతి రోజూ ఏడబ్ల్యూడబ్ల్యూ కి స్టేట్ ఆఫీస్ నుండి వచ్చిన మెసేజ్ ను వాట్సాప్ ద్వారా పంపించడం జరుగుతుందని రిమోట్ లేర్నింగ్ మెసేజ్ లో భాగంగా పిల్లలకి వెల్కమ్ చెప్పించడం ప్రేరణ కల్పించడం పిల్లలకి ఇండోర్ గేమ్స్ అవుట్ డోర్ గేమ్స్ గురించి తెలియచేయడం జరుగుతుంద న్నారు.వీటివల్ల మెదడు అభివృద్ధి అనేది బాగా జరుగుతుందని ఆధార్ శిలా బుక్ ఆధారంగా కథ ఆట పాట ఇంగ్లిష్ వర్డ్స్ ఒక క్రమ పద్ధతి లో ఎలా చెప్పాలి అని చెప్పడం జరుగుతుందన్నారు.ఈ ట్రైనింగ్ లో ఐసిడిఎస్ సూపర్వైజర్ శుభారాణి,ఎంఈ ఓ1 ఆంజనేయులు నాయక్,జెడ్ పిహెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు డిఆర్పీలు చంద్ర నాగరాజు, రవి, శ్రీదేవి మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు





**సోమందేపల్లి ఆగస్టు 12 సీమ వార్త సాయంకాలం** మండల కేంద్రంలోని తొగట వీర క్షత్రియ ఆరాధ్య దైవమైన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి వేద పండితుల మంత్రాలతో ప్రత్యేక పూజలు ఉదయం 10 గంటలకు అమ్మవారికి అభిషేకం మంగళ హారతి అనంతరం ఆలయ ధర్మకర్త,జ్యోతి సంఘం సభ్యులు నడుమ అమ్మవారి జయంతి కేకును కట్ చేశారు. డీసీ ఈశ్వరయ్య దంపతులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జ్యోతి సంఘం సభ్యుల నడుమ శ్రీ చౌడేశ్వరి అమ్మవారి భారీ కేకును కట్ చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురా రోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. పలు గ్రామాల నుండి విచ్చేసిన భక్తులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి సంఘం సభ్యులు బండారు శ్రీనివాసులు, పూజారి శంకర్, రుషీశ్వర్, మామిళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881